తొల్లూరు నాగేశ్వరరావు

# ఆధునిక నీతి కథలు

పద్మనాభరావు ఎం.ఏ. సోషియాలజీ, పంకజాక్షి ఎం.ఏ. ఆంత్రపాలజీ, ఇద్దరూ ఫైనలియర్లో వున్నారు. ఇద్దరి సబ్జక్టులు వేరైనా, ఇద్దరి కులాలు వేరైనా, ఇద్దరి కుటుంబ పరిస్థితులు వేరైనా యూనివర్సిటీకి వెళ్లేటప్పుడు ఉదయం తొమ్మిదిన్నరకు మార్కెట్ స్ట్రీట్‌లో బస్‌స్టాప్‌లో కలుస్తారు, మొదట్లో సామాన్యమైన స్త్రీ పురుషుల్లాగే ఒకళ్లనొకళ్లు పట్టించుకోలేదు. ఎండ కాసినట్టు, మబ్బు పట్టినట్టు, చినుకులు పడ్డట్టు, వాన వెల్సినట్టు, మళ్లీ ఎండ వచ్చినట్టు—ప్రకృతి సహజంగానే ప్రవర్తించారు. ఒకళ్ల మొహాల్లో కళ్లు చూసుకున్నా ఏ భావాన్నీ వ్యక్తపర్చకుండా, ఆ తర్వాత ఒక అడ్వర్టయిజ్‌మెంట్ కేసి నాలుగు సార్లు చూస్తే దృష్టి పడ్డట్టుగా వాళ్లిద్దరూ వారంరోజులపాటూ పరస్పరం చూసుకోగా ఒకళ్లపై మరొకళ్లకు పరస్పరం ఆకర్షణ కలిగింది. ఆ ఆకర్షణ ఆరు మాసాల్లో ప్రేమగా మారింది. ఆ ప్రేమ గాఢమై మరో ఆరు మాసాల్లో పెళ్లి రూపం ధరించింది. ఫైనలియర్ పరీక్షలు అయిపోయాక సింపుల్‌గా, నిరాడంబరంగా, పదిమంది ఫ్రెండ్స్ సమక్షంలో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.

పరీక్షా ఫలితాలు తెలిశాయి.

ఇద్దరూ ప్రథమశ్రేణిలో వారివారి సబ్జక్టుల్లో ఉత్తీర్ణులయ్యారు.

ఆ సంవత్సరమే యూనివర్సిటీలో ఇద్దరికీ వారి వారి డిపార్ట్‌మెంటుల్లో లెక్చరర్ ఉద్యోగాలు వచ్చాయి. ఆ దంపతులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

పంకజాక్షి, పద్మనాభరావూ యూనివర్సిటీకి దగ్గర్లోనే ఒక చిన్న ఫ్లాట్ తీసుకొని కాపురం పెట్టారు.

ఇంటి పెత్తనమంతా పద్మనాభరావు భార్యకిచ్చాడు. నెల మొదటి జీతం తీసుకోగానే ఆ మొత్తాన్ని పువ్వుల్లో పెట్టి భార్యకిచ్చేవాడు. ఆ జీతాన్నీ, తన జీతాన్నీ కలిపి గృహనిర్వహణ వ్యవహారాల్ని పంకజాక్షి చూసేది. బ్యాంకు అకౌంట్ తెరిచి నెలలో మిగిలిన డబ్బంతా అందులో వేసేది. సంసారాన్ని చాల పొదుపుగా, హోదాకు భంగం కలగని విధంగా, అనవసరపు ఖర్చులు

చేయకుండా, కొన్ని కోర్కెల్ని వాయిదా వేసుకుంటూ, మరికొన్ని కోర్కెలను మనస్సులో తావు కల్పించకుండా గృహ నిర్వహణ వ్యవహారాన్ని ఆమె కొనసాగిస్తూ ఉండేది.

అయితే పద్మనాభరావుకు సంపాదన, పొదుపు, ఖర్చుపట్ల నిశ్చితాభి ప్రాయాలులేవు. తనకు నచ్చిన విధంగా ఖర్చు పెట్టుకొనేవాడు. ఆ డబ్బును భార్యను నిర్మొహమాటంగా అడిగేవాడు. అతనికి ఫ్రెండ్స్ సర్కిల్ ఎక్కువ. దాంతో కొన్ని అలవాట్లు చేసుకున్నాడు. సిగిరెట్లు కాల్చడం, సాయంత్రంపూట క్లబ్‌కు వెళ్లి పేకాడడం, అప్పుడప్పుడూ సరదాకోసం మిత్రులతోకల్సి బ్రాందీ, విస్కీలు పుచ్చుకోవడం మొదలైనవి. ఆ సంగతి పంకజాక్షికి తెల్సి ఎంతో బాధపడింది. నిర్మొహమాటంగా భర్తతో దెబ్బలాడింది. హితబోధ చేసింది.

అయితే పద్మనాభరావు అహం దెబ్బతింది. 'నువ్వెంత చదువుకున్నావో నేనూ అంత చదువుకున్నాను. నీదీ నాలాంటి ఉద్యోగమే. నేనూ అంత సంపాయిస్తున్నాను' అనుకున్నాడు. కాని పైకి ధైర్యంగా అనలేకపోయాడు.

మొదట్లో ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవాళ్లు. షికార్లకూ, సినిమాలకూ, యూనివర్సిటీకి, మరేచోటికైనా ఇద్దరూ కల్సే వెళ్ళేవాళ్లు. నిర్మలమైన ప్రేమాభిమానాల ప్రాతిపదికగా, ఇరువురిదీ ఒకే ప్రాణంగా, ఒకే జీవితంగా, ఒకే ఆదర్శంగా జీవించేవారు.

సంవత్సరాలుగడుస్తున్నాయి. పంకజాక్షి ఎం.ఫిల్. చేసింది. పి.హెచ్‌డి. పుచ్చుకుంది. లెక్చరర్ నుంచి రీడర్ అయింది.

పద్మనాభరావు రీసర్చి మీద అంత అభిమానం కనబర్చలేదు. లెక్చరర్ గానే వుండిపోయాడు.

పంకజాక్షి బ్యాంకు అకౌంట్ వందల నుంచి వేలకు మారింది. చవుకగా వూరికి దూరంగా అయిదొందల గజాల స్థలం కొంది. మూడేళ్లలో ఆ స్థలం ఖరీదు పదిరెట్లు పెరిగింది. ఒక హౌసింగ్ కార్పొరేషన్‌లో అప్పు తీసుకొని టూ బెడ్ రూమ్ హౌస్ కట్టింది. ఆ ఇంటి నిర్మాణానికి పద్మనాభరావు తనదంటూ పైసా ఇవ్వలేదు. కాకపోతే ఇంటి అప్పుకు మొదటి ష్యూరిటీగా ఉన్నాడు. ఇంట్లో తాము ఉంటుండగా సగభాగాన్ని అయిదొందలకు అద్దె కిచ్చింది పంకజాక్షి.

పద్మనాభరావు స్నేహితుల పరిధి విస్తృతమైంది. దాంతో ఖర్చులు ఇబ్బడిముబ్బడి అయ్యాయి. విధిగా అప్పులు చేయాల్సి వొచ్చింది. చేబదుళ్ళతో

మొదలైన అప్పులు రోజువారీ వడ్డీదాకా పోయాయి. రెండు మూడు బ్యాంకుల్లో అప్పు తీసుకున్నాడు. నెలకు వడ్డీలకింద జీతంలో సగభాగం పోతోంది. పైపెచ్చు అప్పులవాళ్ళు అప్పుడప్పుడూ ఇంటికి రావడం మొదలెట్టారు. ఒక బ్యాంకువారు కోర్టులో రికవరీకి దావా కూడా వేశారు. ఈ ఆర్థిక ఇబ్బందులవల్ల పద్మనాభరావు మానసికంగా, సామాజికంగా క్రుంగిపోసాగాడు.

కాని పంకజాక్షి ఆర్థికస్థితి ఉన్నతంగా పెరిగింది. రీడర్‌నుంచి ఆమె ప్రొఫెసర్ అయింది.

తన ఆర్థిక దుస్థితి, భార్య ఆర్థిక ఔన్నత్యం గ్రహించిన పద్మనాభరావు తీవ్రమైన మానసిక ఆందోళనకు, అశాంతికి గురయ్యాడు. తన పరపతి సమాజంలో క్షీణించినట్టు తెల్సుకున్నాడు.

పంకజాక్షిది తనకంటే తక్కువ కులం. ఆమె తెలివితేటలు కూడా అంతంత మాత్రమే. కాకపోతే నోటి మంచితనంవల్ల, డబ్బు పొదుపువల్ల-తన కంటే పైచేయిగా ఉంది. పదిరూపాయలు కావాల్సివచ్చినా అమెను అడగాల్సిన దౌర్భాగ్యస్థితి ఏర్పడింది. ఇదంతా తన స్వయంకృతాపరాధమే! తన ఖర్మకు తానే బాధ్యుడు!- అనే పశ్చాత్తాపానికి గురయ్యాడు పద్మనాభరావు. పైపెచ్చు ఆమె ఆర్థికాధికారాల కేంద్రీకరణను సహించలేక పోతున్నాడు. ఆమె ఏం చేసినా ఏం మాట్లాడినా తనని ఎత్తిపొడుస్తూన్నట్టుగా 'ఫీల్' కాసాగాడు.

ఇరువురి మధ్య పూర్వపు ప్రేమానురాగాలు లేవు. కల్సి షికారుకుగానీ, సినిమాకుగానీ వెళ్ళడం లేదు. ఒకే ఇంట్లోనే శత్రువుల్లా జీవిస్తున్నారు.

పంకజాక్షి నెలసరి చీటీలు కడుతోంది. మూడు, నాలుగు రూపాయల వడ్డీకి డబ్బు తిప్పుతోంది. ఇంటిపైన మరో అంతస్థు వేసే ఆలోచనలో వుంది.

పద్మనాభరావు ఒక మార్వాడీ దగ్గర మూడు వేలు అప్పు తీసుకొంటే అది వడ్డీతో రెండింతలై, కోర్టులో డిక్రీ అయి, ఖర్చులతో తడిసి మోపెడైంది డిక్రీ అమలుకు ఒకరోజు ఆ మార్వాడీ అయిదుగురు రౌడీలతో టాక్సీలో ఇంటి మీదకొచ్చి పడ్డాడు.

పద్మనాభరావు భయపడి, చేసేదేమీలేక, పశ్చాత్తాపాగ్నిలో క్రుంగిపోయి బాత్‌రూమ్‌లో దాక్కున్నాడు- బ్రతకటమా, చావటమా అనే మీమాంసతో.

అరగంట తర్వాత పంకజాక్షి బాత్‌రూమ్ తలుపుతట్టింది. తలుపు తీయ లేదు పద్మనాభరావు, భర్త ఏ అఘాయిత్యానికి పాల్పడతాడనో భయపడింది పంకజాక్షి.

"తలుపు తీయండి. బయటకు రండి. డబ్బు నేను కట్టేశాను. వాళ్ళు వెళ్లిపోయారు" అని బిగ్గరగా అరిచింది.

అప్పుడు పద్మనాభరావు బాత్ రూమ్ తలుపులు తెరిచాడు.

భార్య మొహాన్ని ధైర్యంగా చూడలేక టవల్ మొహాన కప్పుకున్నాడు.

"నన్ను క్షమించు పంకజాక్షీ!" అని మాత్రం అన్నాడు నెత్తురు ఇంకిపోయిన మొహంతో.

భార్యాభర్తల మధ్య వయస్సు పెరిగిన కొద్దీ ప్రేమానురాగాల కంటె ఆర్థికాధికారాలు హెచ్చుగా ప్రభావాన్ని చూపెడతాయి.

---


